# కాపురుష్

"బావా సుదర్శనం! పేరుకు తగ్గట్టు అందరిమీదికీ తిరుగుతున్నది నీ కోపం. నాలుక పదునెక్కువైంది. తన కోపమె తన శత్రువు. శత్రువులను పెంచుతున్నావంటే కోపం పెరుగుతున్నాదని అర్థం. నేను నీ హితుడిని, మాగాని అమ్మి వ్యాపారం పెట్టి నడుపుతున్నావా? శాంతం భోషాణం అని శాంతం అలవరుచుకో. బిజినెస్ నడిపే వారికది లాభిస్తుంది. ఒడిదుడుకులతోనన్నా సాగిపోతుంది. జీవితమనే సముద్రంలో వ్యాపారమనే నౌక అప్పులనే కల్లోలానికి గురైనా శాంతం ఒడ్డు పట్టిస్తుంది." మధుసూదనం అంటున్నాడు.

"నీ సలహా యెవడడిగాడు? నీకోసమసలెవరెదురు చూస్తున్నారు? నీ పొలం కాపాడుకోటాని కెన్ని అవస్థలు పడుతున్నావో యెన్ని యెత్తులు వేస్తున్నావో నాకు తెలియదా? చల్లగా స్వంత వ్యవసాయం చాకిరీ అన్న నెత్తిన రుద్ది, ప్రయోజకుల నాశ్రయించి కాళ్ళూ గడ్డాలూ పట్టుకుని కోఛింగ్ సెంటర్ ప్రిన్సిపాలువైనా వెళ్లాగైతేనేం, లోభివి గదూ. అలా దేవిరించటం నావల్ల గాదు." సుదర్శనం కటువుగా అన్నాడు.

"అదుగో చూశావా! దూర్వాసావతారం నిమిషంలో యెత్తావు. వులికి పడుతున్నావు. నిగ్రహం లేదు. నీ అంత సమర్థుడు నష్టపోతే చూడలేను. నేను నిన్ను అవసరాని కాదుకోలేను గనక ముందే హెచ్చరిస్తున్నాను. శాంతం. శాంతం. శాంతం." నవ్వుతున్నాడు మధుసూదనం.

"యేందోయ్ నీవు చెప్పేది? మాటపడి వూరుకోమన్నావా? ఆత్మాభిమానం చంపుకోమంటావా? దద్దమ్మనా? నోట్లో నాలిక దేనికి?" వురిమి చూశాడు సుదర్శనం.

"నోట్లో నాలుకని కాస్త హద్దులో వుంచమంటున్నాను. మిత్రులకన్న శత్రువులే యెక్కువౌతున్నారు. మిత్రము తగుమందు. ముండక్కడనించి పోతావా పోవా? మీ అన్నకు చెప్ప యేమందు పుచ్చుకోవాలో మరదల్ని కాపువేసి పట్టటం నయం చేసుకోమను" వుత్తరీయం దులుపుతూ లేచాడు సుదర్శనం. మొహం యెర్రనైంది.

ఆ కోపంలో కొడతాడేమో నని వెరిచి మధుసూదనం వెళ్ళి పోయాడు.

2

భాస్కరం సుదర్శనానికి దాయాది అన్న అవుతాడు. పెళ్ళిళ్ల ఫిక్సు చెయటం అతని వృత్తి. సుదర్శనం యింటికి వచ్చాడు.

"మా అత్తవారివేపు పెళ్ళికెదిగిన పిల్ల వున్నది సుదర్శనం, చదువు చాలు అన్నారు. పిల్ల బహు చలాకీ, చురుకైన పిల్ల. దాన్ని యింట్లో కట్టేయటం కష్టమౌతున్నది, మితిమీరిన స్నేహాలు చేస్తున్నది. నీవు వారింటికి పొలం అమ్మకం విషయంలో వచ్చి పోతున్నప్పుడు నిన్ను చూసింది. కొంత అల్లరి తగ్గి కుదురుగా వున్నది. వాళ్ళ నాన్నకి పిల్లని నీకివ్వాలని అనిపించింది. నీవంటే బెదురున్నదని కనిపెట్టాడు. దాన్ని కంట్రోల్ చేయగలిగింది నువ్వేనని తీర్మానించుకున్నాడు. యెమ్మే యింగ్లీష్ తీసుకుని చదువుతా

నంటుంది. పట్నంలో వుంచి చదివించేంత డబ్బు లేదు కట్నం హొయ్యాలిగా అంటాడు తండ్రి. నీకు కట్నం లాగాలనే దురాశ లేదని పెద్దమనుషులు చెప్పారుట, యకరం పొలం పిల్లపేర వ్రాసి· ఒంటిమీద బంగారముంచుతాడు, పిల్ల మాణిక్యమే అనుకో, పేరు గూడా అదే, పనీ వంటా నేర్చింది. నీ సంగతి చెప్తే, "చేసుకుం టాను. బావంటేనే ఆడపిల్లలకి హడల్ క్రికెట్ ఆటగాడల్లే వుంటాడు. సంగీతమొచ్చు, ఇండోర్‌గేమ్సూ ఔట్‌డోర్‌గేమ్సూ వచ్చు, అత్తయ్య సూరమ్మే వెరుస్తుంది కొడుక్కి. ఆ మహత్తు బావలోనే వున్నది' అన్నది మాణిక్యం" అని పనస చదివాడు భాస్కరం.

సుదర్శనం మందహాసం చేశాడు, మొహం తేటగా వున్నది, మనిషి తెలుపూ, కడ్డీలాగా వుంటాడు, సిల్క్ షర్ట్, రోల్డుగోల్డు గుండీలు అటువంటివే కఫ్స్ అత్తాకోడలంచు జరీ అంచులు గల ఖద్దరు ధోవతీ ధరించాడు. నల్లని క్రాపూ పేము కుర్చీలో ఠీవిగా కూచుని వున్నాడు సుదర్శనం.

"వారికంత బులపాటంగా వుంటే, పెళ్ళిపెద్దలతో వచ్చి నాతో సంప్రతించాలి, మాణిక్యాన్ని గూడా తెస్తే మంచిది. మనిషి కదలికలూ, కనుపాపలు చూసే సైకాలజీ కనిబెట్టగలను" అన్నాడు సుదర్శనం, పాదాలాడిస్తున్నాడు, చేతిలో కర్ర,

"అలాగే, తప్పకుండాను, సజెషన్ హేతుబద్ధంగా వున్నది" అని లేచాడు భాస్కరం. "సెలవు, మళ్ళా కలుసుకుందాము" వీధి గేటు దాటిన భాస్కరం తనలో తాననుకున్నాడు. "నేను చెప్పిన

దంతా నిజమని నమ్మాడేమో, తాను నిజంగా అటువంటి యోగ్యుడనని వుబ్బిపోయినట్టున్నాడు సుదర్శనం. కళ్ళల్లో గర్వం తొణికిసలాడింది."

3

ఆఫీసులో పర్సనల్ అసిస్టెంటుగా పనికి కుదురుకున్న సుబ్బరాజు నమ్మకస్థుడని రికమెండేషన్ తెచ్చుకున్నాడు, నిలబడి చేతులు కట్టుకుని ఘోష పెడుతున్నాడు.

"సార్! మీరు స్వయంగా ఆఫీసులోనూ, గల్లాపెట్టె దగ్గరా కనపడాలి. బేపర్వాగా తాళాలు వదిలేసి సొరుగు మూసి సిగరెట్ తాగుతూ, చదరంగమాడుతూ, కిల్లీ నవులుతూ ఒక కాలుమీద ఒక కాలువేసి పక్కకిఒరిగి పడుకుని పాదమాడిస్తూ తన్మయత్వంతో నవ్వుకుంటూ చెస్ పావులే చూస్తుంటే వ్యాపారం నష్టంవేపు నడుస్తున్నది. జీతాలందటం లేదని పనివాళ్లు ఒక్కొక్కరే యూనియన్లో చేరుతున్నారు. నేను మీ హితైషిని, కనక బాధ కలిగి చెప్తున్నాను.

"డ్రాయరు సొరుగులో డబ్బు లెక్క నాకు గుర్తుంటుంది. పోతే నా సంగతెరగరూ? డిస్మిస్ చేస్తా, మరోడొస్తాడు డొక్క మాడేవాడు, చమ్డాలూడదీస్తా" డ్రాయరు సొరుగులోని డబ్బు లెక్క చూసుకుంటూ సుదర్శనం తలెత్తకుండా అన్నాడు.

"పోనీ నన్ను మానేజరుగా వేయండి సార్, వ్యాపారం మీ పేరే వుంటుంది, కొద్దిగా జీతం పెంచి అధికారమిస్తే చాలు, పని

వారిని మానేజ్ చేయటం, బిజినెస్ రన్‌చేయటం వచ్చు" అన్నాడు రాజీపడతాడని ఆశించాడు.

అటువంటప్పుడు నువే బిజినెస్ స్టార్ట్ చేసి యెందుకు రన్ చేయలేదు?" అన్నాడు క్రాసెగ్జామినర్‌లాగా.

"పెట్టుబడికి డబ్బేదీ, భూములమ్మి పెడతామంటే భూములసలే లేవు" అన్నాడు సుబ్బరాజు అనాలోచితంగా.

తలెత్తాడు సుదర్శనం, సొరుగు మూశాడు, డబ్బు జేబులో పెట్టుకుంటూ యెర్రబడిన మొహంతో అన్నాడు.

"యేమని పేలున్నావో తెలుసా? పొగరెక్కిందా, ఒళ్ళు పోయ్ తెలియటంలా? నేను భూములమ్మి వ్యాపారం పెట్టానని యెద్దేవా చేస్తావా? జాగర్త. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు. భూములమీద తగినంత రాబడిలేక చేతిదే పెట్టాల్సి వస్తుంటే అమ్మనా? అందరిచుట్టూ తిరగాలా?"

"ఇపుడూ తిరుగుతూనే వున్నారు గదండీ. అఫీసులో కుర్చీలో యెంతసేపుంటున్నారూ. తిడితే తిట్టారుగానీ, నన్ను నమ్మరూ నష్టం చూడరు. నమ్మి చెడినవారూ లేరూ అన్నారు." శాంతింపచేయాలని నవ్వుతూ అన్నాడు సుబ్బరాజు.

"నీ సలహా యేం బాగున్నదీ? నీవడిగిన పని నీకిస్తే నాకు చేతగాని వెధవని పేరు రాదూ?" అని వెళ్ళబోయాడు,

"యేమో సార్ యేం పేరొస్తుందో చెప్పలేను గానీ, మీరు

చేసిన అప్పు తీర్చేయకపోతే, 'ఏమిటి సుదర్శనం ధీమా! వడ్డీ పెరిగిపోతున్నది. తడిపి మోపెడవుతున్నది, వేలం పడుతుంది బిజినెస్, నీవు చెప్పు సుబ్బరాజూ! నీవాయన అంతరంగికుడవు, అని హెచ్చరించారు సార్ వడ్డీ వ్యాపారులు."

"నీకెన్ని గుండెలు అలా మాట్లాడటానికి? నా తడాఖా తెలియదేమో. పొవర్ దావా వేసి అంతా లాగేస్తాను. నీమీద మాన నష్టం దావా వేస్తాను. నీతల తిరిగిపోయింది. చట్టమొచ్చింది. నీకు తెలియదేమో" అని పోదోయాడు.

సుబ్బరాజు చేతులు దాచి అడ్డమొచ్చాడు.

"నా తల సరిగ్గానే నా భుజాలమీదున్నది సార్. మరొక కంపెనీవారు నన్ను మానేజరుగా వేస్తాం రమ్మని లూర్ చేస్తున్నారు. మీకు రాజీనామా కాగితమిచ్చి నెల అయింది. విచారిస్తారు సార్. మీ మంచి కోరేవానిని కోల్పోతున్నారు. ఓ పట్టాన మిమ్మల్ని వదిలి వెళ్ళలేక వున్నాను. రేపే ఫస్ట్" అంటూ వెళ్ళిపోయాడు.

(4)

టొబాకో కంపెనీలో గుమాస్తా ప్రకాష్ గడియారాల రిపేరు షాపు చిన్న రూములో పెట్టుకుని రాత్రిళ్ళు పనిచేసి ఎక్స్ట్రామనీ సంపాయిస్తున్నాడు. డిగ్రీ రాగానే కొన్నాళ్ళు కోచింగ్ సెంటర్లో జాబ్ చేసి మంచి ట్యూటరని పేరుబడ్డాడు. జీతాలందటం లేదని కొందరు మానేసేవారితో కలిసి తానూ మానేశాడా ట్యూటర్ జాబ్. కాని ఆ పేరట్టాగే వుండిపోయింది. ప్రైవేట్గా పరీక్షలు వ్రాయ

దలచిన స్టూడెంట్సు ప్రకాష్‌ని ట్యూషన్ చెప్పమంటారు. జీతం ముందే యిస్తారు. శ్రద్ధగా చెప్పి పరీక్ష పాస్ అనిపిస్తాడు ప్రకాష్. చాలా ట్యూషన్సు తీసుకోడు. మూడే. వాటిలో ఒక ట్యూషన్ సుదర్శనం చెల్లెలు జాబ్ చేసుకుంటూ పార్ట్ బై పార్ట్ పాసౌతూ గ్రాడ్యుయేట్ కావాలని ఆశయం. విడో, పొలం మీది ఐవేజు చాలదు. డిగ్రీ రాగానే ప్రమోట్ చేస్తారు కంపెనీవారు భర్త యాక్సిడెంటులో పోతే కొడుకు కామెర్లు తాకి పోయాడు. జీవిక పోరాటం సాగించి జాబ్ తెచ్చుకున్నది. పేరు సరోజిని. తనకన్న చిన్నవాడిని పైకి తేవాలని ఆశయం. ఆదాయం తక్కువ. పని యెక్కువ.

చేతి గడియారం రిపేర్ చేస్తున్న ప్రకాష్ పక్క కుర్చీలో బైఠాయించాడు సుదర్శనం. మెల్లిగా అటెండెన్సు పెంచి, స్నేహ శీలిలాగా నటిస్తూ బాతాఖానీలోకి దింపి, "వీని వుద్దేశమేమిటి? దురుద్దేశమైతే మొగ్గలోనే తుంచి వీని ట్యూషన్ మాన్పించి నా చెల్లెల్ని సన్మార్గాన నడిపించాలి. సరోజినికి యెటువంటి అన్న వున్నాడో తెలియని ఫూల్ వీడు. నా తడాఖా చూపుతాను" అను కుంటూ విషపు నవ్వు దాస్తూ, 'వీడిగుట్టు లాగాలి. వీడి నడవడి యెట్టిదీ?' అనుకున్నాడు సుదర్శనం. ఒక గడియారం తెచ్చాడు.

"యేమి చేస్తూ వుంటారు? రోజు అటెండెన్సు వేస్తున్నారే. మీ వాచీకి రిపేరు అక్కర్లేదు. బాగానే నడుస్తున్నది, అది మిష లాగా వున్నది. నాతో పని వున్నాదా?" అనడిగాడు ప్రకాష్.

"పని యేమీ లేదు. లేడీ స్టూడెంట్సే ట్యూషన్ కెందుకు

పెట్టుకుంటారు మిమ్మల్ని? లేట్ నైట్ క్లాసెస్సే ఎందుకు?"

మెల్లిగా తలెత్తి బార్‌లైట్ వెలుగులో సుదర్శనాన్ని పరిశీలనగా చూశాడు ప్రకాష్. నవ్వు వచ్చింది. "ఓ! ఐసీ! మీరు సరోజిని బ్రదర్, పోలికలున్నాయి, పని యేమీ లేదనే మాట సరిపోయింది. సరోజినివి గొప్ప ఆశయాలు. పరీక్షలు పాసై ప్రమోషన్ తెచ్చుకుని కుటుంబానికి సాయపడుతూ దైవమనుకూలిస్తే స్టేట్స్‌కి వెళ్ళాలని చూస్తున్నానన్నారు. కంప్యూటర్ సైన్సెస్ నేర్చుకుంటే మంచి ఛాన్సున్నది వెళ్ళటానికన్నాను. మీకు దురభిప్రాయం కలిగినట్టున్నది. ఒక గంట కంప్యూటర్ క్లాసికి అటెండయి యింటికెళ్ళేప్పటికి చీకటి పడుతుంది. తర్వాత యింటి పని తర్వాత నా ట్యూషన్. క్లాస్‌లో నా ఫ్రెండున్నాడు. అవకాశమిస్తాడంటే మీ సిస్టర్ ఆశలు పెంచుకున్నారు" అంటూ ఓరగా చూశాడు ప్రకాష్.

"రాత్రులందే ట్యూషన్లెందుకు పెట్టుకున్నారు?"

"పగలల్లా పని నాకు. మీకూ ఓనాడు తీరిక చిక్కని పని వుండేదిట. ఇపుడు నిర్వ్యాపారత్వమనే లక్జరీ అనుభవిస్తున్నారు, అది వ్యసనంగా మారితే కష్టం వస్తుంది. అందుకని నేను చేతుల నిండా పని కల్పించుకుంటాను. పచ్చకామెర్లు సోకితే ప్రపంచమంతా పచ్చగా కనిపిస్తుందిట, మీరు డాక్టర్ని కలుసుకోండి. ఇక్కడికొచ్చి నా టైమ్ వాడుకుంటున్నారు, యు ఆర్ విలింగ్ అన్ బారోడ్ టైమ్" అంటూ తలవంచి వాచీ చూస్తున్నాడు ప్రకాష్.

"మాటలు తిన్నగా రానీ, యే కులం మీది? ఫీజెంత? యే మతం?" అనడిగాడు సుదర్శనం కటువుగా.

"మాదా రెటమతం. మనిషిని చూసే పోల్చచ్చునే. అఫ్రి కన్సుని గుర్తించవమా? అమెరికన్నీ, రష్యన్నీ తేలిగ్గా గుర్తిస్తాం" అన్నాడు నవ్వుతూ.

"నీ తలతిక్క నా దగ్గర సాగదు. రిపేర్ షాప్ అనే కవర్ కింద వున్న గ్రంథసాంగుడివి. దాన్ని చెల్లించి యెంత లాగావు? ఇంకొక్క పైసా అందదు నీకు. సరోజిని గొప్పింటి అమ్మాయి. గొప్పింటి కోడలు, బద్మాష్!" అని లేచాడు సుదర్శనం.

"ఓహో. యేమి కల్చర్! నా రూమ్‌కొచ్చి నన్ను అవమానిస్తున్నారే! సరోజిని అరుగురు వర్కింగ్ విమెన్ వున్న హాస్టల్ రూములో వుంటున్నది. ఒంటరిగా లేదే! మనిషినవమానించి అనుమానించమని యే మతం చెప్తున్నది? వ్యాపారం వేలం పడేట్టు చేయి అని మతం బోధిస్తున్నదా? రాజీబేరం పెట్టి మెల్లిగా అప్పు తీర్చేయమనీ, వ్యాపారం మీద శ్రద్ధ తీసుకోమనే హితోక్తులు పెడ చెవిని పెట్టి దేశంమీద దిమ్మరిగా తిరగమని యే మతం చెపుతున్నాది?" అంటూనే బెల్ నొక్కాడు ప్రకాష్.

పహిల్వాన్‌లాగా వున్న గళ్ళ లుంగీ తెల్ల లాల్చీ ధరించిన వాచ్‌మన్ ఇబ్రహీమ్, నాలుగో అంతస్తులోని రూమ్‌లోకి లిఫ్ట్‌ద్వారా వచ్చి నిలబడ్డాడు. సుదర్శనాన్ని చూశాడు.

"నాచేత మెడపట్టి గెంటించుకోరాదు సార్. గొప్పింటి బిడ్డ అని మీ మొహం చెపుతున్నది. మర్యాదగా రండి. లిఫ్టులో దిగుదాం. వన్‌మినిట్. కారూ డ్రైవరూ రెడీ సార్" అని చేతులు దులుపుకుంటూ పిలిచాడు ఇబ్రహీం.

సుదర్శనం మొహం పదునెక్కిన సుదర్శన చక్రంలాగా అయింది. లేచాడు. "నీమీద లైంగిక వేధింపు అనే కేసుపెట్టి నీ అంతు చూస్తాను. సంపాయించింది, లాగిందీ కక్కాలి. స్త్రీ సమాజాలున్నాయి" అంటూ వాచ్‌మన్ వెంట వెళ్ళాడు.

## 6

"బావా సుదర్శనం! ఖాళీగానే వున్నావుగా బిజీగా లేవుగా! టూమచ్ ఫ్రీడం. అలా గుళ్ళోకెళ్ళి, దైవదర్శనం చేసుకొద్దాం రా. హరిర్హరతి పాపాని. పోయేదేమీ లేదు" అంటూ వచ్చాడు మధుసూదనం.

అది సంధ్యా సమయం. చల్లగా వున్నది. గుడిగంటలు వినబడుతున్నాయి. సుదర్శనం కాళ్లు జాపి వరండాలో కూచుని వున్నాడు.

"మళ్లా వచ్చావే మధుసూదనం! నీవిట్లా అడ్డూఆపూ లేకుండా వచ్చి నన్ను డిస్టర్బ్ చేయకుండా వుండే మార్గం కనిబెట్టాను. ఖాళీగా యెక్కడున్నాను? చేతినిండా పని, మా తల్లిగారు వృద్ధులైనారు. శుక్లాలేర్పడ్డాయి. తక్కిన సంతుకేమీ పట్టదు, చింతా లేదు నేనే

తల్లినిన్నీ కనిబెట్టి వుండి అన్నీ పన్లు చేస్తూ వంటా వడ్డనా గూడా చేస్తున్నాను."

"అత్తయ్య తన మేధస్సుతో సంపాయించి కూడబెట్టిన సొమ్ము నీ చేత అలా చేయిస్తున్నదిలే. లేచిరా. ఇపుడే వచ్చేద్దాం ఇంకా వంటకు వేళ కాలేదు" అన్నాడు మధుసూదనం. నిలబడే వున్నాడు.

ఇద్దరూ మంటపంలోకి చేరేప్పటికి పురాణం చెప్పే శాస్త్రి గారు "కోపము। నుబ్బును। గర్వము॥ ఆపోవని దురభిమానము। నిర్వ్యాపారత్త్వము కాపురుష గుణంబులండ్రు కౌరవనాధా!" అని చదివి పుస్తకం మూసి సంచీలో పెట్టాడు అయన అయిదింటినించీ ఆరింటివరకు పురాణం చెపుతాడు,

"అమ్మా! అయ్యా! టైమైంది. భాగవతారిణి పరమేశ్వరి వచ్చేశారు, కొద్ది విరామం తరవాత భాగవతారిణి ఆధ్యాత్మ రామాయణం గానంచేస్తూ అభినయిస్తూ మిమ్మల్ని అలరింపజేస్తారు" అని లేచి సంచీపట్టుకుని వెళ్ళి రంగనాధునికి మొక్కి వెళ్ళిపోయాడు.

— ౦ —